ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 2 ఆగస్టు 2025



మంథని డిపో నుంచి ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మంథని ఆర్టీసీ డిపో నుంచి పలు పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపనున్నట్లు డీఎం శ్రావణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 3న కొమురవెల్లి, కొలనుపాక, స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, 10న మేడారం, మల్లూరు లక్ష్మీనర్సింహాస్వామి, భద్రాచలం, పర్ణశాల, 17న కాణిపాకం, వేలూరు, అరుణాచలం, అలంపూర్ జోగులాంబ. 24న మానసాదేవీ, కోటిలింగేశ్వరస్వామి, చాముండేశ్వరీ, ఏడుపాయల, 31న అహోబిలం, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నెం. 9701046752ను సంప్రదించాలని కోరారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు

- సీజన్‌కు సరిపడా అందుబాటులో యూరియా
- రైతు భరోసా కింద రూ. 161.02 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- నేడు 73,400 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమ
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి శ్రీనివాస్



డీఏవో శ్రీనివాస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జిల్లాలో ఎరువుల కొరత లేదు.. సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉంది. ఈ విషయమై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతు భరోసా కింద 1,51,507 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

- పెద్దపల్లి, (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పంటల సాగు ఎక్కడి వరకు వచ్చింది?

డీఏవో: వానాకాలం సీజన్‌లో సకాలంలో వర్షాలు పడని కారణంగా పంటల సాగు ఆలస్యమవుతున్నది. జిల్లాలో ఈ సీజన్‌లో ప్రధా నంగా రైతులు వరి, పత్తి సాగు చేస్తారు. 2,72,677 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశాం. ఇప్పటి వరకు వరి 2,12,000 ఎకరాలకు గాను 1,18,200 ఎకరాలు, పత్తి 52,500 ఎకరాలకు గాను 47,820 ఎకరాలు, మొక్కజొన్న 377 ఎకరాలు, కంది 282 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు ఆలస్యం కావడం వల్ల వరి నాట్లు పడడం లేదు. గతేడాది ఈ సమయానికి 70 శాతానికి పైగా నాట్లు పూర్త య్యాయి. ఎస్సారెస్పీ నీళ్లు విడుదల చేసిన తర్వాత రైతులు వరి నాట్లు వేయనున్నారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎరువుల కొరత ఉందా?

డీఏవో: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సరిపడా ఉన్నాయి. యూరియాకు కొరత ఏర్పడ కుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఈ సీజన్‌కు 25 వేల మెట్రి క్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 15,736 టన్నుల యూరియా సరఫరా కాగా, 11,795 టన్నుల యూరియాను రైతులు కొను గోలు చేశారు. సహకార సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో 3,941 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. కోటా ప్రకారం రావాల్సిన యూరి యాలో ఈ నెల 5న 3 వేలు, 12న 3 వేల టన్నుల యూరియా సరఫరా కానున్నది. అవసరం మేరకే రైతులు పంటల్లో యూరియా వినియోగించాలి.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయా?

డీఏవో: జిల్లాలో సాగుకు యోగ్యమైన భూములు ఉండి పట్టాలు గల 1,51,507 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద ఎకరానికి 6వేల రూపాయల చొప్పున 161 కోట్ల 2లక్షల 63వేల368 రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ విషయమై రైతుల నుంచి తమకు రైతుభరోసా డబ్బులు రాలేదనే ఇప్పటి వరకు ఫిర్యాదులు రాలేదు.

ఆంధ్రజ్యోతి: సాంకేతిక కారణాల వల్ల రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతులకు డబ్బులు వచ్చాయా?

డీఏవో: జిల్లాలో పలువురు రైతుల ఖాతాల నంబర్లలో, పేరులో, ఆధార్ నంబర్లు తప్పుగా నమోదైన వారి వివరాలను గత ఏడాదే ప్రభుత్వానికి పంపించాం.

ఆంధ్రజ్యోతి: సబ్సిడీ పథకాల కింద రైతులకు ఏమైనా పని ముట్లు ఇస్తున్నారా?

డీఏవో: ఎస్ఎంఏఎం (సబ్ మిషనరీ అగ్రికల్చరల్ మెటీరియల్) పథకం కింద జిల్లాకు 2025-26 సంవత్సరానికి 83 లక్షల 43 వేల రూపాయల నిధు లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకం కింద 50 శాతం సబ్సిడీపై రోటా వేటర్లు, గడ్డి కట్టలు కట్టె యంత్రాలు, కల్టివేటర్లు, పవర్ స్ప్రేయర్లు, పవర్ వీడ ర్లు, ట్రాక్టర్ కేజ్‌వీల్స్, హ్యాండ్ స్ప్రేయర్లు, తదితర పరికరాలను అందజేయనున్నాం. త్వరలోనే కలెక్టర్ సూచనల మేరకు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రధానమంత్రి కిసాన్ నిధులు ఎప్పుడు జమ చేయనున్నారు?

డీఏవో: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం యేటా 2 వేల చొప్పున మూడు దఫాలుగా 6 వేలు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు 19 దఫాలుగా రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం డబ్బులు జమ చేసింది. 20వ విడత డబ్బులను ఈ నెల 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ నిధులను విడుదల చేయనున్నారు. జిల్లాలో 73,400 మంది రైతుల ఖాతాల్లో 14 కోట్ల 68 లక్షల రూపాయలు జమ చేయనున్నారు.



పదవీకాలం పొడిగింపా.. ప్రత్యేక పాలనా..

- సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియ చేపట్టని ప్రభుత్వం
- ఈనెల 15తో ముగియనున్న పాలకవర్గాల గడువు
- ఇప్పటికే ఆరు నెలల పొడిగింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలక వర్గాలకు పొడిగించిన పదవీ కాలం ఈ నెల 14వ నాటికి ముగియనున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎన్నికల ప్రక్రియ చేపట్టక పోగా, పాలక వర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు మాసాలు పొడిగిస్తారా, ప్రత్యేక అధికారుల పాలన తీసుక వస్తారా అనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏడాదిన్నర క్రితం గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం, ఏడాది క్రితం మండల, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం ముగియగా, ఆరు మాసాల క్రితం మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. వీటన్నింటికీ ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఫిబ్రవరి 14 తేదీతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీ కాలం ముగిసింది. అయితే ప్రభుత్వం సహకార సంఘాల్లో ప్రత్యేక అధికారుల పాలన తీసుక రాకుండా, పాలక వర్గాల పదవీ కాలాన్ని ఆరు మాసాలు పొడిగించింది. ఆ గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనున్నది.

● జిల్లాలో 20 సహకార సంఘాలు..

జిల్లాలో ప్రస్తుతం 20 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. సుల్తానాబాద్ మండలంలో సుల్తానాబాద్, గర్రెపల్లి, కనుకుల, చిన్నకల్వల, సుద్దాల, ఎలిగేడు మండలం ఎలిగేడు, ధూళికట్ట, జూలపల్లి మండలం జూలపల్లి, ఓదెల మండలం పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం కాల్వశ్రీరాంపూర్, కూనారం, పెద్దపల్లి మండలం పెద్దపల్లి, అప్పన్నపేట. ధర్మారం మండలం ధర్మారం, పత్తిపాక, కమాన్‌పూర్ మండలం కమాన్‌పూర్, ముత్తారం మండలం ముత్తారం, మంథని మండలం మంథని, పాలకుర్తి మండలం కన్నాల, రామగుండం మండలం మేడిపల్లిలో సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 52,316 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతోపాటు దీర్ఘకాలిక, బంగారం తాకట్టు, వాహన, ఇతర రుణాలు అందజేస్తున్నారు. అలాగే ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల విక్రయాలు చేపడుతున్నారు. రైతులు పండించిన పంట ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 250కి పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి సీజన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం వల్ల కమీషన్ రూపేణా యేటా 12 కోట్ల రూపాయలు సహకార సంఘాలకు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ద్వారా ఆదాయం సమకూరుతున్నది. ఈ డబ్బులు సంఘం అభివృద్ధికి దోహద పడుతున్నాయి.

● ఎన్నికల ప్రక్రియ చేపట్టని ప్రభుత్వం..

సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం దగ్గర పడుతున్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటి వరకు

(మిగతా 8వపేజీలో)

నేడు మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకోసం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం మంథనిలో పర్యటించనున్నారు. ఎకాస్‌పూర్ జెడ్పీహెచ్ ఎస్ పాఠశాల ఆవరణలో రూ. 2.70 లక్షలతో నిర్మించే బాలుర హాస్టల్ భవనానికి శంకుస్థాపన, మున్సిపాలిటీ పరిధిలో రూ.6.70కోట్లతో నిర్మించిన పాత పెట్రోల్ పంపు సమీపంలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారు.

సింగరేణి సంస్థ సీఎస్ఆర్ ద్వారా 10వతరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్యూర్ కోడ్ మెటిరి యల్స్ స్థానిక హైస్కూల్ విద్యార్థులకు అందజేసి వన మహోత్సవంలో పాల్గొంటారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నమునా ఇందిరమ్మ ఇంటిని, మున్సిపాలిటీలో రూ.20.50కోట్లతో 410 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పైలన్ శంకుస్థాపన చేస్తారు. ఈజీఎస్ నిధులు రూ.1.70కోట్లతో నిర్మించే నూతన గ్రామ పంచాయతీల భవనాలకు శంకుస్థాపన చేస్తారు. ఏఎంసీ కార్యాలయం వద్ద పాలక వర్గానికి సన్మానం చేస్తారు. ఆర్ఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డుల పంపిణీ, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తారు.

'దేశీ' కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ (దేశీ)లో డిప్లొమా కోర్సు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువులు, క్రిమిసంహారక దుకాణాల లైసెన్స్ కలిగి ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులైన 80 మంది డీలర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం దరఖాస్తుదారులు రూ.14 వేలు, భవిష్యత్తులో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే ఇతరులు 28 వేల రూపాయలు 'ప్రాజెక్టు డైరెక్టర్ ఆత్మ, దేశీ పెద్దపల్లి' పేరిట డీడీ తీయాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 48 వారాలు ప్రతి ఆదివారం, మార్కెట్ సెలవు రోజున తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఏక కాలంలో దేశీ కోర్సు రెండు బ్యాచులను నిర్వహించేందుకు ఇద్దరు సమన్వయకర్తల కోసం కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసి ఐదేళ్లు వ్యవసాయ రంగంలో పని చేసిన అనుభవం కలిగి ఉండాలన్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి కలెక్టరేట్‌లోని వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని డీఏఓ శ్రీనివాస్ తెలిపారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి




సుల్తానాబాద్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

సుల్తానాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని, ఎవరైన రైతులు పాస్‌బుక్ తీసుకురాకుండా వస్తే సాగుఎక్కడ చేస్తున్నారో వివరాలు తెలుసుకొని ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. చిన్నకల్వలలోని ఇందిరమ్మ ఇండ్లనిర్మాణ పనులు, ఎంపియూపిఎస్, ప్యాక్స్ ఎరువుల గోడౌన్, నారాయణపూర్‌లోని ఎంపిపిఎస్, జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడికేంద్రం, పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలుతీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నారాయణపూర్ పాఠశాలలవద్ద శిథిలావస్థలో ఉన్న భవనాలతొలగింపు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి రాబోయే ఐదేళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సుల్తానాబాద్ మండలంలో 526 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, 94ఇండ్లు బేస్మెంట్ వరకు పూర్తయ్యాయన్నారు. చిన్నకల్వలలో మంజూరైన 15 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, లబ్ధిదారులకు ఇంటినిర్మాణం ప్రారంభించేందుకు అవసరమైతే మహిళా సంఘాలద్వారా లక్ష రూపాయల రుణాలు అందించాలని కలె క్టర్ తెలిపారు. సుల్తానాబాద్ ఆసుపత్రిలో పలు వార్డులను పరిశీలించారు. నెలకు 29ప్రసవాలు జరుగుతున్నాయని, అదనపు సిబ్బంది, స్కాన్ మిషన్ మంజూరు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ బషీరుద్దీన్, మండల పంచాయతీ అధికారి సమీర్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, పంచాయతీరాజ్ ఏఈ సచిన్, మండల విద్యాశాఖ అధికారి రాజయ్య, మండల వ్యవసాయ అధికారి నాగార్జున పాల్గొన్నారు. చిన్నకల్వల సింగిల్ విండో గోదాంను కలెక్టర్ తనిఖీచేశారు. యూరియా బస్తాలు వివరాలను తెలుసుకున్నారు. సీఈవో వల్లకొండ రమేష్, ఏవో నాగార్జున పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్‌కు భూములు ఇవ్వం

● రత్నాపూర్‌లో ఆర్డీవో సమక్షంలో గ్రామసభ ● భూములు ఇవ్వమని వినతి



భూముల స్వాధీనానికి ఒప్పుకోమని అధికారులకు విన్నవిస్తున్న గ్రామస్థులు

రామగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్‌పై శుక్రవారం ఆర్డీవో సురేష్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఆర్డీవో సురేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టపరిధికి లోబడి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనుందని, అందుకు కావాల్సిన 203 ఎకరాల భూములు మేడిపల్లి పరిధిలోని 63 మంది రైతుల వద్ద సేకరిస్తామన్నారు. దీని పై గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. గతంలో గ్రామంలోని అనేక కార్యక్రమాలకు భూములను స్వాధీనం చేసుకున్నారని ప్రజలు వాపోయారు. ఇండ్రస్ట్రియల్ పార్క్‌కు భూములు ఇవ్వమని మెజార్టీ ప్రజలు నిరాకరించారు. గ్రామంలోని సుమారు 50 మంది రైతులు లిఖిత పూర్వకంగా ఆర్డీవోకు అందజేశారు. గ్రామంలోని 203.31 ఎకరాలకు ప్రభుత్వ పట్టా భూమి 56.12 గుంటలు ఉండగా పట్టాభూమి 147.19 ఎకరాల్లోని సుమారు 60 మంది రైతులు వ్యతిరేకంగా, 19 మంది అంగీకారం తెలుపుతూ పత్రాలను ఆర్డీవోకు అందజేసినట్లు తెలిసింది. స్థానికంగా లేని పట్టాదారులు అనుకూలంగా ఫోన్‌లో ఆర్డీవోకు సమాచారం ఇచ్చినట్లుగా సమాచారం. తహసీల్దార్ సుమన్, ఇండ్రస్ట్రియల్ జిల్లా జోనల్ మేనేజర్ మహేశ్వర్, ఏవో శ్రీకాంత్, మంథని, గోదావరిఖని సీఐలు రాజు, ఇంద్రాసేనరెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేలా వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ కార్మికుల వేతనాలు, ప్రజల కనీస సౌకర్యాలకు సాధారణ నిధులే ముఖ్యమని, పన్నుల వసూళ్లతో సాధ్యమవుతుందన్నారు. మొండి బకాయిల వసూళ్లపై కూడా దృష్టి పెట్టాలన్నారు. పన్ను వసూళ్లలో మెరుగైన పనితీరు కనబరిస్తే 15వ ఆర్థిక సంఘం ప్రోత్సాహాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఆర్ఓ అంజనేయులు, ఆర్ఐలు శంకర్‌రావు, ఖాజా, వార్డు అధికారులు పాల్గొన్నారు.

కాటేసే కాలం.. అప్రమత్తతతో జర పదిలం..

● వర్షాకాలంలో అధికంగా సంచరించనున్న పాములు ● వ్యవసాయ పనుల సమయంలో జాగ్రత్తగా ఉండాలి
● రెస్క్యూ టీంతో పాములు, ప్రజలను రక్షిస్తున్న యువకులు ● పీహెచ్‌సీల్లో అందుబాటులో వ్యాక్సిన్

7

ఆలయాల్లో శ్రావణ సందడి



మహాలక్ష్మి ఆలయంలో పూజలు

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకొని మహాలక్ష్మి, వాసవి కన్యకాపరమేశ్వరి, లలితాంబిక ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాల్లో అమ్మవార్లకు వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. వాసవిమాత ఆలయంలో 108 కిలోల కుంకుమ్మతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ప్రత్యేక భజనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు



నదిలో ఎక్స్‌కావేటర్‌తో ఇసుక తవ్వకాలు

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరినదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. వన్యప్రాణి మోసళ్ల సంరక్షణ కేంద్రం పరిధిలో ఉన్న గోదావరినదిలో శుక్రవారం అనుమతులు లేకుండా కొందరు ఎక్స్‌కావేటర్ సహాయంతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఇసుకను ట్రాక్టర్లలో నింపి పోచమ్మవాడ ప్రాంతంలో నిల్వ చేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టి కొన్ని గంటల పాటు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా రవాణా చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. మొదట అందరూ గోదావరి నదిలో నిర్మించే బ్రిడ్జి నిర్మాణ పనులుగా భావించారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ఇంకా డిజైన్ పూర్తి కాలేదని అధికారులకు సమాచారం రావడంతో గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపటినట్లు గుర్తించారు. ఈ విషయం తహసీల్దార్ కుమారస్వామి దృష్టికి వెళ్లడంతో ఆయన గోదావరి వద్దకు వెళ్ళి విచారించగా ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు అక్కడ ఉన్న వారు పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సైతం మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే ఇసుకను తీసుకోవాలని సూచించి తవ్వకాలను నిలిపి వేయించారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

ఎన్టీపీసీ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడి మృతి


శ్రీకాంత్(ఫైల్)

జ్యోతినగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో శుక్రవారం నారిశెట్టి శ్రీకాంత్(40) అనే కాంట్రాక్టుకార్మికుడు మృతి చెందాడు. ప్రాజెక్టులోని డీఎం ప్లాంటులో పని చేస్తున్న శ్రీకాంత్ ఉదయంషిఫ్టులో పని చేస్తుండగా అస్వస్థతకు గురై కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీకాంత్‌ను తోటికార్మికులు ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ ఆసుపత్రిలో విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గోదావరిఖనిలో నివాసం ఉంటున్న శ్రీకాంత్ ప్రాజెక్టులోని డీఎం ప్లాంటులో రాజ్‌కుమార్ అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. విధినిర్వహణలో చనిపోయిన కాంట్రాక్టుకార్మికుడు శ్రీకాంత్ కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు, కాంట్రాక్టర్ల మధ్య సాయంత్రం వరకు చర్చలు జరిగాయి. మృతుడి కుటుంబానికి 7 లక్షల రూపాయల నష్టపరిహారం, 50వేలరూపాయలు అంత్యక్రియలకు ఇవ్వాలని, కుటుంబంలో ఇద్దరికి లోకేషన్‌లో పనిఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చర్చలలో జేఏసీ నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, భూమల్ల చందర్, రాజమల్లయ్య, భూమయ్య, కాంట్రాక్టర్లు ఎ.బి.సి.రెడ్డి, చిగిరి నారాయణ, ఎ.రాజేశం, వి.వెంకటేశ్వర్‌రావు, చందా రాధాకృష్ణారావు, సోమిరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన దావు రాజయ్య(65) మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. కొంత కాలంగా కుటుంబసభ్యులకు దూరంగా ఉంటున్న రాజయ్య కరీంనగర్‌లో కూలీ పని చేసుకుంటూ బస్టాండ్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం జగిత్యాల డిపోబస్సు(టీఎస్ 21టి 5353)ను డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి రోడ్డుదాటుతున్న రాజయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆర్టీసీడ్రైవర్ ముత్యాల గాంధీపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

బోయినపల్లి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం మల్లాపూర్ శివారు గ్రామం రేగులపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనూషను రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామానికి చెందిన బిట్టుతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహం అయింది. అత్తమామలతో కాకుండా వేరే కాపురం పెడదామని అనుష భర్తను కోరింది. భర్త నిరాకరించడంతో గతనెల 23న పురుగుల మందు తాగింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన రాకేష్ (32) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెద్దపల్లి రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాకేష్‌కు ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహమైన ఏడాది అనంతరం మతిస్థిమితం కోల్పోయాడు. మూడేళ్ళ క్రితం భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పెద్దపల్లికి, అక్కడి నుంచి కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

రైతుకు ధీమా.. ఇఫ్కో బీమా



ఎరువు బస్తాపై
రూ. 10 వేల బీమా

గరిష్టంగా
రూ. 2 లక్షల వరకు
ప్రయోజనం

చొప్పదండి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతుకు అండగా ఉండాలని ఇఫ్కో ఎరువుల కంపెనీ సంకట హరణ బీమా యోజన పేరుతో ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించింది. వర్షాలు పడుతున్న సమయంలో పొలంలో పనిచేసే రైతులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ఇఫ్కో ఎరువుల కంపెనీ ఉచితంగా సంకటహరణ బీమా పథకాన్ని తీసుకు వచ్చింది. సహకార సంఘాల ద్వారా ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు ఈ పథకాన్ని వర్తింప జేస్తున్నారు. ఈ బీమా పథకానికి ప్రత్యేకంగా ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఎరువుల బస్తాలు కొనుగోలు చేస్తే 10 వేల నుంచి 2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారు.

● బీమా ప్రయోజనాలు

ప్రమాదాల్లో మృతిచెందిన, అంగవైకల్యం సంభవించినా బీమా రైతులకు వర్తిస్తుంది. రైతులు సహకార సంఘాల్లో ఇఫ్కో ఎరువులను కొనుగోలు చేయాలి. ప్రతి ఎరువు బస్తా, నానో యూరియా, డీఏపీ, బాటిల్ కొనుగోలుపై 10 వేల బీమా వర్తిస్తుంది. అత్యధిక బీమా 2 లక్షల పరిమితి ఉంటుంది. ఎరువులను కొనుగోలు చేసిన రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే వందశాతం బీమా, రెండు అవయవాలు కోల్పోతే 50 శాతం బీమా, ఒక అవయవకం కోల్పోతే 25 శాతం బీమా పరిహారం లభిస్తుంది. రోడ్డు ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాము కాటు, గ్యాస్ సిలిండర్ పేలడం, అగ్ని యంత్రాల వల్ల కలిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుంది. రైతులు ఎరవులు కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి ఏడాది వరకు ఈ బీమా వర్తిస్తుంది.

● నిబంధనలు

రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో రశీదు తప్పనిసరిగా భద్రపర్చుకోవాలి. రశీదుపై కొనుగోలు చేసిన రైతు పేరు, తండ్రి లేదా భర్త పేరు, తేదీ, చిరునామా, ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పేరు, రైతు సంతకం లేదా వేలిముద్ర ఉండాలి. రైతు మరణానికి సంబంధించిన డెత్ సర్టిఫికెట్, మృతి కేసు నమోదైతే ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్టులను సమర్పించాల్సి ఉంటుంది. ప్రమాదం సంభవించిన రోజు నుంచి రెండు నెలల్లోపు ఈ పత్రాలను సికింద్రాబాద్‌లోని ఇఫ్కో టోక్యో అధికారులకు సమర్పించాలి.

రైతులకు ఉపయోగకరం



కళ్లెం తిరుపతిరెడ్డి, ప్యాక్స్ సీఈవో, చొప్పదండి

రైతులకు ఈ బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సహకార సంఘం నుంచి ఎరువులను కొనుగోలు చేసిన ప్రతి రైతుకు ఇది వర్తిస్తుంది. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లో శుక్రవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన దాడి నర్సయ్య పొలంలో గొర్రు కొట్టేందుకు అదేగ్రామానికి చెందిన అనుముల అంజయ్య తన రెండుఎద్దులతో కూలీకి వెళ్లాడు. గొర్రుకొడుతుండగా పొలంలోఉన్న విద్యుత్ స్తంభం సపోర్టువైరుకు తగలడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. రెండేళ్లుగా రెండు ఎద్దులతో జీవనోపాధి పొందుతున్నాని, మృతిచెందిన ఎద్దును రూ.70వేలతో కొనుగోలు చేశానని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని వేడుకున్నాడు. అనంతరం అధికారులు అక్కడికిచేరుకొని పంచనామా చేశారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400 పలికింది. శుక్రవారం ఇద్దరు రైతులు 9క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాటద్వార గరిష్ఠధర రూ.7400చెల్లించి పత్తి కొనుగోళ్లుచేపట్టారు. శని,ఆదివారం మార్కెట్‌యార్డుకు సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం క్రయవిక్రయాలు ప్రారంభంకానున్నట్లు కార్యదర్శి ఆర్‌మల్లేశం తెలిపారు.

ప్రమాదవశాత్తు గ్రానైట్‌క్వారీ సూపర్‌వైజర్ మృతి


దీకొండ రాజు(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగీర్‌పల్లి గ్రామశివారులో గల గంగదేవి గుట్టపై ఉన్న శ్రీలక్ష్మి గ్రానైట్స్‌లో పనిచేస్తున్న దీకొండ రాజు(45) అనే సూపర్‌వైజర్ ప్రమాదవశాత్తు రాయితగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన దీకొండరాజు కొంతకాలంగా సైదాపూర్ మండలం జాగీర్‌పల్లి గ్రామశివారులో గల గ్రానైట్‌క్వారీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం రాజు వృత్తిలో భాగంగా గుట్టపై నిర్వహిస్తున్న బండ కటింగ్ వద్దకు పోయాడు. గుట్టపైరాయి కట్‌చేసి ఎక్స్‌కవేటర్‌తో కిందపడేస్తుండగా కొంతదూరంలో ఉండి సెల్‌ఫోన్‌తో రికార్డు చేస్తున్నాడు. ఇంతలో గ్రానైట్ బండకింద ఉన్న బురదలో అందులోని బండరాయి ఎగిరి వేగంగావచ్చి రాజు కనుతకు (తలకు) తగిలింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన అక్కడే తనతోపాటు పనిచేస్తున్న వర్కర్లు క్వారీ యజమానికి సమాచారం ఇచ్చారు. క్వారా యజమాని రాజు కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతుడు రాజు భార్య దీకొండ సంతోష్‌కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


తునికి శ్రీనివాస్(ఫైల్)

గొల్లపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె రెవెన్యూ గ్రామ శివారులోని జగిత్యాల-ధర్మారం ప్రధానరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో గ్రామానికి చెందిన తునికి శ్రీనివాస్(29) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తునికి రాజనర్సు- అంజవ్వ దంపతుల ఒక్కగానొక్క కొడుకు శ్రీనివాస్. తండ్రి చిన్న తనంలోనే మృతి చెందడంతో తల్లి అన్నీతానై పెంచి చదివించింది. శ్రీరాములపల్లె రెవెన్యూ శివారులోని వెంగళాపూర్ బైపాస్ రోడ్డుసమీపంలో రోడ్డు పక్కన కంకులు కాల్చుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తనతల్లిని రోజూమాదిరి సాయంత్రం ఇంటికి తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కొద్దిక్షణాల్లో తల్లి వద్దకు చేరేక్రమంలో వెనకాలనుంచి అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో శ్రీనివాస్‌రోడ్డుపై పడడంతో లారీఅతడి తలపైనుంచి వెళ్లగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. లారీతోపాటు డ్రైవర్‌అక్కడి నుంచి పారిపోయాడు. ఉన్నఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంరూపంలో కళ్లెదుటే తిరిగిరాని లోకాలకు తరలివెళ్లడంతో తల్లి శ్రీనివాస్ మృతదేహంపై పడి రోదించిన తీరుఅక్కడున్న వారందరినీ కలిచివేసింది. సమాచారం తెలుసు కున్న గొల్లపల్లి పోలీసులు సంఘటన నాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో జగిత్యాలజిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. కాగా శ్రీనివాస్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓప్రైవేట్‌ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకోగా మూడు నెలల క్రితం ఇద్దరు ఆడ కవల పిల్లలు జన్మించారు. దీంతో శ్రీరాముల పల్లెలో తీరని విషాదం అలుముకుంది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

జ్యోతినగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్‌లో బుధవారం జరిగిన వలసకార్మికుడు వినోద్ బుబాజీ సోన్కర్ హత్య కేసులో నిందితుడు మనోజ్ వర్మార్కర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు రామగుండం సీఐప్రవీణ్‌కుమార్ తెలిపారు. తోటి కార్మికుడితో 100రూపాయల అప్పు విషయంలో జోక్యం చేసుకున్నందుకే వినోద్‌ను రాడ్‌తో కొట్టి మనోజ్ హత్య చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడిభార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని 24గంటల వ్యవధిలోనే అరెస్టుచేసినట్లు చెప్పారు. హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని, మనో జ్‌ను కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

బోయినపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు బోయినపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కూర సంపత్ అనే వ్యక్తి ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ముగ్గురు పిల్లల్ని శుక్రవారం ఉదయం స్కూల్ బస్సు ఎక్కించేందుకు రోడ్డుపైన వేచిఉంది. అయితే సంపత్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ముస్తాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న డ్రైవర్, ట్రాక్టర్ ఓనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ శుక్రవారం తెలిపారు. ఆవునూర్ గ్రామపరిధిలోని ఎగువ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసు కను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల పర్శరాములు, అలాగే ఓనర్ పాక రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిని పట్టుకొని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ అమలు

● ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో మహిళను హత్యచేసిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన రౌడీ షీటర్ బొల్లు మనోజ్(20) అనే యువకుడికి పీడీ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బి. గీతే తెలిపారు. నిందితుడు మనోజ్‌కు పీడీయాక్ట్ నిర్బంధ ఉత్తర్వులను చందుర్తి సీఐవెంకటేశ్వర్లు శుక్రవారం అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారని ఆయన తెలిపారు. 2023లో ఓ హత్య, దొంగతనం, బెదిరింపులకు పాల్పడిన కేసుల్లో నిందితుడిగా ఉన్న మనోజ్‌పై శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని 2024లో రౌడీషీట్ ఓపెన్ చేశామని తెలిపారు. పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా మనోజ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడమే కాకుండా తరచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నందున కలెక్టర్ పీడీ యాక్ట్ అమలుచేయడానికి ఉత్తర్వులు జారీచేశారన్నారు. జిల్లాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని తెలిపారు.


రౌడీ షీటర్‌కు పీడీయాక్ట్ నోటీసు అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

వరకట్న వేధింపులకు వివాహిత బలి

● ఉరి వేసుకుని ఆత్మహత్య


హేమలత(ఫైల్)

మానకొండూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో ఓ వివాహిత వరకట్న వేధింపులు భరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన చలిగంటి నాగయ్యతో ఐదేళ్ల క్రితం శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన హేమలత(24)కు వివాహం అయింది. వివాహ సమయంలో నాలుగు లక్షల నగదుతోపాటు ఇతర లాంచనాలతో అందించారు. వివాహ అనంతరం భర్త నాగయ్యతో పాటు అత్త పోచమ్మ, ఆడబిడ్డలు రుద్రారపు స్వరూప, ఎల్కపల్లి కొమురమ్మ అదనపు కట్నం కోసం వేధించేవారు. దీంతో ప్రసవానికి తల్లిగారింటికి వెళ్లిన హేమలత బిడ్డకు జన్మనిచ్చింది. ఐదు నెలల క్రితం అత్తగారింటికి వచ్చింది. వరకట్న వేధింపులు అధికం కావడంతో గురువారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు హేమలత తల్లి కొయ్యెడ సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదు సంవత్సరాల జైలు శిక్ష

● తీర్పు వెల్లడించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి

వేములవాడ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇద్దరువ్యక్తులపై అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నం చేసిన సంఘటనలో ఇద్దరికి 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. ఒక వెయ్యి జరిమాన విధిస్తూ అసిస్టెంట్ సేషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ తీర్పు వెల్లడించారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండల కేంద్రానికిచెందిన అలువాల శ్రీనివాస్‌కు చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన భూపతిమల్లయ్య కూతురితో వివాహం చేశారు. అయితే శ్రీనివాస్ భార్య కొద్ది రోజుల క్రితం పురుగుల మందుతాగి మృతిచెందింది. చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ప్లాట్ వద్దకు శ్రీనివాస్ తనమిత్రుడు మోహన్‌తో కలిసి వెళ్లారు. తన కూతురు మృతికి తన అల్లుడు శ్రీనివాస్ కారణమని అనుమానంతో శ్రీనివాస్, మోహన్‌లపై భూపతి మల్లయ్య, కుమారుడు విజయ్‌లు కలిసి కర్ర, ఇనుపరాడుతో దాడి చేశారని శ్రీనివాస్ తల్లి అలువాల లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రఫీక్ ఖాన్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి సీఐ వెంటకేష్ చార్జ్‌షీట్ దాఖలుచేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్‌సెషన్స్ కోర్టు న్యాయ మూర్తి అజయ్‌కుమార్ జాదవ్ నిందితులకు 5సంవత్సరాల జైలుశిక్షతో పాటుగా రూ.ఒకవెయ్యి జరిమానా విధించినట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో ఆవుదూడ మృతి

● పరిశీలించిన అటవీ అధికారులు

తంగళ్లపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో మిడిదొడ్డి రాంచంద్రంకు చెందిన ఆవుదూడపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందింది. గ్రామ శివారులోని పొలం వద్ద దొడ్డిలో ఉన్న ఆవుదూడ శుక్రవారం ఉదయం గాయాలతో మృతిచెంది కనిపించింది. ఆవుదూడపై దాడి చేసింది చిరుత అంటూ ప్రచారం జరిగింది. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి పరిశీలించి కుక్కలు దాడి చేయడంతో మృతిచెందిందని తేల్చారు.

శతాధిక వృద్ధురాలి మృతి


రాజు(ఫైల్)

రాయికల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపల్లెగ్రామానికి చెందిన దయ్యాల రాజు(110) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం మృతిచెందింది. ఈమెకు ఆరుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈమెకుమారుడు దయ్యాల బీరమల్లయ్య గతంలో రామారావుపల్లె సర్పంచ్‌గా పనిచేశారు.

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మునిగాల మణిపాల్‌రెడ్డి

చిగురుమామిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మునిగాల మణిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుందరగిరిలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కక్కెర్ల వెంకటమల్లుకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకరోజులుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు మాత్రం మారలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా వెంటనే పెండింగ్‌లో ఉన్న తమసమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాల బాటపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్‌కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మండల విద్యాధికారి పావణి, మండలపరిషత్ సూపరిండెంట్ ఎండీ ఖాజామొయినోద్దిన్, అన్నిగ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడి

వేములవాడ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తాజ్‌ఫ్యామిలీ రెస్టారెంట్‌లో స్టేట్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా అధికారులు రోహిత్‌రెడ్డి, శ్రీషిక, స్వాతి, అంకిత్‌రెడ్డి కలిసి తాజ్‌ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తనిఖీ చేశారు. రెస్టారెంట్ పూర్తిగా అపరిశుభ్ర వాతవరణంలో భోజనం తయారుచేయడం, కిటికీలకు మెష్ లేకపోవడం, పెస్ట్‌కంట్రోల్ పాటించకపోవడం గుర్తించామని, రిఫ్రిజిరేటర్‌లో నిలువచేసిన మాంసంను ఉత్పత్తులను భారీ మొత్తంలో గుర్తించారు. ఎగ్జాస్టర్ ఫ్యాన్స్‌పై నూనెతో కూడిన దుమ్ము, ధూళి పేరుకుపోయి అపరిశుభ్రంగా గుర్తించారు. కుళ్లిపోయిన ఉడికినగుడ్లు, హానికర రసాయనాలు కలిపిన కృత్రిమ రంగుల బిర్యాని, ఇతరఆహారతయారీకి ఉపయోగించడం గుర్తించామని, రెస్టారెంట్‌లో రూ.20,500 విలువ గల సుమారు 70కేజీల నిలువ ఉంచిన మాంసం, కాలం చెల్లిన టీపొడర్ ఇతర ముడిసరుకులు లేబుల్ డిఫున్స్ కలిగిన కాజు, మసాల పొడులు, మిగిలి ఉంచిన బిర్యాని తదితర వాటిని ప్రజల ఆరోగ్య నిమిత్తం హోటల్ యాజమాన్యాన్ని ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ హెడ్‌జ్యోతిర్మయి హెచ్చరించి అక్కడిక్కడే ధ్వంసం చేయించింది. ఎఫ్ఎస్ఎస్-2006 చట్టం ఉల్లంగించనందుకు హోటల్‌కు నోటీసులు జారీచేశారు. అదే విధంగా మున్సిపల్ అధికారుల సమన్వయంతో హోటల్‌లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణం ఉన్నందున రూ.30 వేల జరిమానా విధించి తాజ్ రెస్టారెంట్‌ను రెక్టిఫికేషన్ చర్యల నిమిత్తం తాత్కాలికంగా మూసి వేసినట్లు అధికారులు వెల్లడించారు.

సిరిసిల్లలో..

సిరిసిల్ల టౌన్: నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం హెడ్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ పీ రోహిత్‌రెడ్డి, ఎస్ శ్రీషిక, పీ స్వాతి, వీ అంకిత రెడ్డి బృందం జిల్లాకేంద్రంలోని రుచిహోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్లో అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయడం, ఫుడ్ హ్యాండ్లర్స్ గ్లౌజ్, హెయిర్‌క్యాప్స్ ధరించకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వండిన ఆహారాలపై మూతలు కప్పకపోవడం ఈగలతో కూడిన ఆహారం ఉండడం, మూతలతో కూడిన డస్ట్‌బిన్స్ వాడకపోవడం, పెస్ట్ కంట్రోల్ లేకపోవడం, నాణ్యత లేని ముడిసరుకుల ఉపయోగించడం, ఫంగస్ ఉన్న కూరగాయలను ఉపయోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. అదే విధంగా రుచి హోటల్‌కు సంబంధించిన రికార్డ్స్ మెయింటేన్ చేయకపోవడం, ఫుడ్ సేఫ్టీ 2006 నిబంధనలను ఉల్లంఘించినందుకు యాజమాన్యానికి నోటీసులు జారీచేసి జరిమానా విధించారు. కుళ్లిపోయిన పదార్థాలు, ముడిసరుకులను అధికారులు అక్కడే ధ్వంసం చేశారు. అనంతరం అనుమానిత ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు.


వేములవాడ తాజ్‌హోటల్‌లో ఆహార నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఉరి వేసుకొని టైలర్ ఆత్మహత్య

చొప్పదండి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని బీసీకాలనీకిచెందిన దండే పరంధాములు(43) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నా డు. బీసీకాలనీలో టైలరింగ్ పనిచేస్తున్న పరంధాములు మద్యానికి అల వాటుపడి జీవితంపై విరక్తిచెందాడు. గురువారం రాత్రి టైలర్‌షాపులో ఇనుప పైపులకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 6గంటలకు ఇంటినుంచి పరంధాములు వెళ్లి తిరిగి సాయంత్రం వరకు రాకపోవడంతో కొడుకు వెళ్లి టైలర్‌షాపలో చూడగా ఉరి వేసుకొని మరణించి ఉన్నాడు. పరంధాములు భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మత్స్యకారుడి మృతి

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులచెరువులో చేపలవేటకు వెళ్లిన స్థానిక బోయినిపేటకుచెందిన మత్స్య కార్మికుడు తాళ్లపల్లి శేఖర్(45) పాముకాటుతో శుక్రవారం మృతిచెందాడు. చెరువులో చేపలవేటకు వెళ్లిన శేఖర్‌ను పాము కాటు వేయగా గమనించలేదు. ఇంటికి వెళ్లిన తర్వాత అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ వెల్లడించారు. శేఖర్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసహాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రెండు లారీలు ఢీ: డ్రైవర్ మృతి

సుల్తానాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొని రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ షకీల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళుతున్న లారీ అదే మార్గంలో ఆగి ఉన్న మరో లారీని వెనకవైపు నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ షకీల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. క్యాబిన్ లో చిక్కుకొని మృతి చెందిన లారీడ్రైవర్ షకీల్ మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్‌తో పోలీసులు బయటకు తీశారు. క్లీనర్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐలు శ్రావణ్ కుమార్, అశోక్‌రెడ్డి షకీల్ మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాటేసే కాలం.. అప్రమత్తతతో.. జర పదిలం



- వర్షాకాలంలో అధికంగా సంచరించనున్న పాములు
- వ్యవసాయ పనుల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి
- రెస్క్యూ టీంతో పాములు, ప్రజలను రక్షిస్తున్న యువకులు
- పీహెచ్‌సీల్లో అందుబాటులో వ్యాక్సిన్



మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పాములు అధికంగా సంచరిస్తాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూమిలో, పుట్ట ల్లో ఉన్న పాములు వర్షాలు పడిన వెంటనే చల్లటి వాతావరణం కోసం బయటికి వస్తాయి. ఇంట్లో, పరిసరాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్క లు, కట్టెలు, బండ రాళ్లతోపాటు ఇళ్లలోని సూర్లు, రంధ్రాల్లో ఉంటాయి. పాముల సమీపంలోకి వెళ్లడం, చూడకుండ వాటిపై అడుగు వేయడంతో కాటు వేస్తాయి. రాత్రి, పగలు రైతులు పొలాలకు వద్దకు వెళ్లే సమ యంలో పాము కాటుకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతున్నారు. సింగరేణి సంస్థ ఓసీపీ-2 పరిసరాల ప్రాంతాలు, నిర్వాసిత గ్రామాల్లో పాములు సంచారం అధికంగా ఉంటుంది.

19 పాముల రకాల పాముల్లో 4 మాత్రమే విష పూరితం..

మన ప్రాంతంలో 19 రకాల పాములు సంచరిస్తాయి. అయితే వాటి లో నాగుపాము, కట్ల పాము, రక్త పింజర, తుట్టే పురుగు లేదా చిన్న పింజర మాత్రమే విషపూరితమైనవి. వీటిలో రక్తపింజర, కట్ల పాములు కేవలం రాత్రి వేళల్లో మాత్రమే సంచరిస్తాయి. ఆహారమైన కప్పలు, ఎలుకలు, కోడి పిల్లల కోసం నాగు పాములు ఇంట్లోకి, ఆవరణలోకి, పొలాల్లో సంచరిస్తుంటాయి. పామును చూడకుండా తొక్కడం, తాకితేనే అవి కాటు వేసే అవకాశం ఉంటుంది.

విషపూరిత కాట్లను ఎలా గుర్తించాలి..

విష పూరితమైన పాము కాటు వస్తే ఆ ప్రాంతంలో ఒక్కటి లేదా రెండు గాట్లు పడతాయి. రెండు కంటే ఎక్కవ కాట్లు కనిపిస్తే అది విషపూరిత పాము కాదని గమనించాలి.

చికిత్స కోసం ఏ విధంగా స్పందించాలి..

పాము కాటు వేస్తే ఆందోళన పడకుండా ఉండాలి. వేగంగా నడవటం, పరుగెత్తడం చేయవద్దు. కదలకుండా ఒకే చోట కూర్చుని కుటుంబ సభ్యులు లేదా 108 కాల్ చేసి సమీపంలోని ఆసుపత్రికి వెళ్లిచికిత్స పొందాలి. గంటన్నర లోపు చికిత్స అందించాలి. ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే కాటు వేసిన చోట సబ్బుతో కడిగి కాటు వేసిన చోట రక్తస్రావం అయ్యేలా చూడాలి. విషం పైగానికి వెళ్లకుండా తాడు, గుడ్డతో కాటుపై భాగంలో కట్టాలి. నాటు వైద్యం, మంత్రాలు, పసరుల పేరిట కాలయాపన చేయవద్దు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఇంటి చుట్టూ చెట్ల పొదలు, కట్టెల కుప్పలు, చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు లేకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా ఎలుకలు లేకుండా ఇంట్లో శుభ్రత పాటించాలి. ఇంట్లో వెల్లుల్లి, కిరోసిన్ వాసన వచ్చే విధంగా చూసుకోవాలి.

సింగరేణి, నిర్వాసిత గ్రామాల్లో పాముల సంచారం అధికం..

సింగరేణి నిర్వాసిత, పరిసరా గ్రామాల్లో పాముల సంచారం అధికంగా ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రామగిరి మండలం బేగంపేట, లద్నాపూర్, ఆదివారంపేట, రామయ్యపల్లి, పన్నూరు, రత్నాపూర్, రాజాపూర్, మంథని మండలంలోని అక్కెపల్లి గ్రామాల్లోని ఇళ్లలోకి పాములు వస్తుంటాయి. ఓబీ కుప్పలు, పిచ్చి మొక్కలు, చెట్లు అధికంగా ఉండటంతోనే పాములు వస్తున్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు.

పాము అగుపిస్తే ఫోన్ చేయండి..

ఇంట్లో, పరిసరాల్లో ఎక్కడైనా పాము లు కనిపిస్తే వాటిని పట్టుకొని సురక్షిత ప్రాంతాల్లో వదిలి పెట్టడానికి మంథని ప్రాంత వాసులు స్నేక్ సత్తీ సెల్ నెం: 9059425978, కల్వచర్ల గ్రామానికి చెందిన కారెంగుల శ్రీను సెల్ నెం: 8008862433 కాల్ చేయాలి. వీరితోపాటు ఇతర ప్రాంతాల్లో పాములు పట్టే వారిని సంప్రదించాలి.

ఆసుపత్రుల్లో అందుబాటులో ఏఎస్‌వీ వాయిల్స్..

పాముకాటు గురైన వ్యక్తికి శరీరంలో విషం విరుగుడు కోసం ఇచ్చే యాంటీ స్నేక్ వీనం (ఏఎస్‌వీ) వాయిల్స్ (ఇంజక్షన్లు) జిల్లాలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీలతో పాటు మంథని, పెద్దపల్లి సీహెచ్‌సీలు, గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో కూడా ఏఎస్‌వీ వాయిల్స్ స్టాక్ అందుబాటులో ఉన్నాయి. పాము కాటు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే మంచిది.

600లకు పైగా పాములను పట్టుకున్నా

నల్గొండ సతీష్ అలియాస్ స్నేక్ సత్తి, మంథని.



పది సంవత్సరాలుగా దాదాపు 600లకు పైగా పాములు పట్టా. వాటిలో ఎక్కువగా నాగుపాములే ఉన్నాయి. పాములను గాడుదులగండి గుట్ట సమీపంలోని అడవిలో వదిలి పెడుతా. పాములు పట్టడానికి ఎవరి వద్ద ఒక్క రూపాయి డిమాండ్ చేయను. చిన్నప్పటి నుంచి ఆసక్తితో సొంతంగా పాములు పట్టడం నేర్చుకున్నా. వాటి వల్ల ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదానికి గురి కాలేదు.

పాముల పరిరక్షణకు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ

కారెంగుల శ్రీను, స్నేక్ క్యాచర్, కల్వచర్ల

పాములను, వాటి నుంచి ప్రజల రక్షణ కోసం ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సేవలందిస్తుంది. ఇండ్లల్లో, పరిసరాల్లో, రోడ్ల పై, షాపుల్లో ఎక్కడైనా పాములు కనిపిస్తే అందుబాటులో ఉన్న వలంటీర్లకు సమాచారం ఇస్తే పాములను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలి పెడుతాం. సికింద్రాబాద్‌లోని స్నేక్స్ రెస్క్యూ సెంటర్ (ఎస్ఆర్‌సీ) హెల్ప్ లైన్ నెం. 837423366 కాల్ చేస్తే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న వలంటీర్లను పంపి పాములను పట్టి సురక్షిత ప్రాంతాల్లో వదిలి వేసే విధంగా సహాయం చేస్తారు. ఈ ఎన్‌జీవో ఆర్గనైజేషన్‌లో ట్రైనింగ్ పొందాను.

సాధారణ ప్రసవాలను పెంచాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకుడు రవీంద్రనాయక్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 75 శాతం సిజేరియన్ కాన్పులతో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని దీనిని తగ్గించి సాధారణ ప్రసవాలు అయ్యేలా గర్భిణులను ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య సంచాలకుడు డాక్టర్ రవీంద్ర నాయక్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధానాసుపత్రిని రవీంద్ర నాయక్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ ఎంజీ కృష్ణమూర్తి స్వాగతం పలికారు. అనంతరం రవీంద్రనాయక్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి వివిధ కార్యక్రమాల అమలులోని లోటుపాట్లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామన్నారు.



మల్యాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ సంచాలకుడు రవీంద్రనాయక్

ఈ సందర్భంగా ఆయన పలువురు రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమావేశమై జిల్లాలో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో అందుతున్న ల్యాబ్ సేవలు, ప్రసవాల గురించి తెలుసుకున్నారు. సిజేరియన్ కాన్పులను తగ్గించి సాధారణ ప్రసవాలు అయ్యేలా గర్భిణులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆర్ఎంవో సుమన్ మోహన్‌రావు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ సంచాలకుడు రవీంద్రనాయక్ సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, వైద్యశాఖ అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, మాతా, శిశు ఆరోగ్య కార్యకలాపాలపై సమీక్షించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అర్చన, ఏఎంవో సత్యనారాయణ, వైద్యాధికారి మౌనిక వైద్య సిబ్బంది ఉన్నారు.

కరీంనగర్ నుంచి మంచిర్యాలకు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులు

భగత్‌నగర్/చొప్పదండి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట మీదుగా మంచిర్యాల వరకు నాలుగు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించినట్లు కరీంనగర్-2 డిపో డీఎం ఎం.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6:10 వరకు ప్రతీ 30 నుంచి 45 నిమిషాలకు బస్సు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్సారార్ కళాశాలలో ఏఐపై ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఏఐపై ఈ నెల నుంచి అంతర్జాతీయ ఉచిత శిక్షణ ఇవ్వను న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ ఒక ప్రకట నలో తెలిపారు. ఏఐ స్కూల్, హైదరాబాద్ కళాశాల, విద్య శాఖ సం యుక్తంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు మూడు నెలలపాటు వారంతంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన పది కళాశాలల్లో ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ఒకటి అని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో బ్యూటీ పార్లర్, మగ్గం ఎంబ్రాయిడరీ వర్క్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 11నుంచి బ్యూటీ పార్లర్‌లో, ఆగస్టు19వ తేది నుంచి మగ్గం ఎంబ్రాయిడరీ వర్క్స్‌లో శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. దీనికి ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఆసక్తి గల స్త్రీలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849411002, 7981151653 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాడుతాం..

- ఈ నెల 8న జిల్లా కేంద్రంలో సభ
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పక్కన ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నలభైరెండు శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పోరాడుతామని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో చింతకుంటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'మేమెంతో మాకంతా' అనే నినాదంతో 42శాతం రిజర్వేషన్ సాధిస్తామన్నారు. అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్, రూ.5 లక్షల కోట్ల నిధులు మంజూరు చేసి బీసీల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని తుంగలో తొక్కారని అన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా రేవంత్‌రెడ్డి తానా అంటే తందాన అన్న చందంగా వ్యవహరిస్తోందన్నారు. తమ హయాంలో పరిష్కరించినవి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరు వాత సమస్యలుగా మారాయన్నారు. 42శాతం రిజర్వేషన్, కులగణన అటకెక్కించారన్నారు. తమిళనాడు తరహాలో శాసనసభలో బిల్లు పెట్టి దానిని ఢిల్లీకి పంపించాలని, అందుకు తాము మద్దతు తెలుపుతామని అన్నారు. షెడ్యూల్ నంబరు 9లో ఈ అంశాన్ని చేర్చాలన్నారు.

కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా అది విజయంతమవుతుందని, ఇందులో భాగంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడంలో భాగంగా ఈనెల 8న జిల్లా కేంద్రంలోని సర్కస్ గ్రౌండ్ (జ్యోతి బాపూలే గ్రౌండ్)లో మధ్యాహ్నం 3 గంటలకు సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, శాసన మండలి మాజీ చైర్మన్ కేఎం స్వామిగౌడ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, సతీష్ బాబు, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనమల్ల విజయ, ద్యావ వసంత, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- మహాలక్ష్మీ అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన భక్తులు
- వాయినం ఇచ్చిపుచ్చుకున్న మహిళలు



వేములవాడలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. ఉదయాన్నే ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన భక్తులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. రాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, ఒడి బియ్యం అందజేశారు. అనంతరం తులసీచెట్టుకు పూజలు చేసి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి



ధర్మపురిలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న మహిళలు

ధర్మపురి: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. అనేక మంది భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాధికాపవన్, రాంకిషన్, విజయలక్ష్మి అందంగా అలంకరణ చేసిన అమ్మ వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా, విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



భీమారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందారం ఉన్నత పాఠశాలకు చెందిన బత్తుల రుచిత మెట్‌పల్లిలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుచితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అస్ఫాక్ హుస్సేన్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పుల్లూరి ఉమారాణి, గ్రామ నాయకులు అభినందించారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు.

వ్యవసాయం పేరు.. అక్రమాల తీరు



హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పన్ను మినహాయింపు కోసం వ్యవసాయం పేరిట ట్రాక్టర్లను కొనుగోలు చేసి వాణిజ్య అవసరాలకు వాడుతున్నారు కొందరు అక్రమార్కులు. ఇసుక, మట్టి, రాయి రవాణా వ్యాపారం జరిగే ప్రతిచోట ఈ ట్రాక్టర్లు దర్శనమిస్తుండటం గమనార్హం.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..

వ్యవసాయం పేరుతో కొనుగోలు చేసే ట్రాక్టర్, ట్రాలీకి ప్రభుత్వం రోడ్డుట్యాక్స్ మినహాయింపు ఇచ్చింది. వ్యవ సాయ ట్రాక్టర్లను వ్యవసాయేతర పనులకు వాడటం చట్ట రీత్యా నేరం. కానీ ఆ నిబంధనలు అమలు కావడం లేదు. వాణిజ్య పరంగా కొనుగోలు చేసే ట్రాక్టర్లు, ట్రాలీకి కలిపి ఏడాదికి రూ.6వేల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను నుంచి తప్పించుకునేందుకు ఇసుక, మట్టి, ఇటుక, రాయి వ్యాపారం చేసే వారు వ్యవసాయం పేరుతో ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, ట్రాలీకి వేర్వేరు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అనంతరం రెండింటికి రవాణా శాఖా ధికారులు వేర్వేరు అంకెలతో నంబర్ ప్లేట్లు అమర్చు తారు. వ్యవసాయం అయితే తెలుపు, వాణిజ్య అవసరాలకు పసు పు రంగు నంబరు ప్లేట్లు ఇస్తారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల మీద నంబర్ ప్లేట్లు లేకుండా కొన్ని ఇసుక ట్రాక్టర్లు పరుగులు తీస్తున్నాయి. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఆయాగ్రామాల్లో వ్యవసాయం పేరుతో వాణిజ్య అవసరాలకు వాడేట్రాక్టర్లు పెద్దసంఖ్యలో ఉన్నా యి. ఆయా ట్రాక్టర్లతో రాయి, కంకర, మట్టివ్యాపారం నడిపిస్తున్నారు. ఇక్కడ ట్రాలీకి నంబర్ ప్లేట్లు లేకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

కంచె వేణు, ఎంవీఐ, హుజూరాబాద్

రహదారిపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. వ్యవసాయం పేరిట రిజిస్ట్రేషన్ చేసి వాణిజ్య పరంగా వాడితే అలాంటి వాహనాలపై చర్యలు తీసుకుంటాం. వాణిజ్య అవసరాలకు వాడితే తప్పనిసరిగా వాటి రూల్స్ ప్రకారంగా వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి

ఆలయ ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులతో మర్యాదపూర్వంగా ప్రవర్తించాలని సంబంధిత ఉద్యోగులు, సిబ్బందిని ఈవో రాధాబాయి ఆదేశించారు. రాజన్న ఆలయంలోని శుక్రవారం ముఖ్యమైన విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లడ్డూల విక్రయ కేంద్రం, తయారీ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పీఆర్వో ఆఫీస్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రావణ మాసంలో రాజన్న ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, భక్తులకు నాణ్యమైన లడ్డులను అందిం చాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా చర్యలు చేపట్టాలని సూచించారు.

పాత బండి ఈ-బైక్‌గా మారేనండి..

- విద్యార్థి వినూత్న ఆలోచన..
- రూ.6 ఖర్చుతో 40 కిలోమీటర్ల ప్రయాణం



పాత బైక్‌కు పరికరాలను బిగిస్తున్న విద్యార్థి వంశీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి వ్యవసాయ పొలం, ఇతర పనుల నిమిత్తం పెట్రోల్ బండిపై వెళ్లేందుకు నిత్యం ఆర్థిక భారంగా మారింది. రోజుకు ఇంధనానికి రూ.100 వెచ్చించాల్సి వస్తోంది. తన తండ్రికి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు వినూత్నంగా ఆలోచన చేశాడు. మూలకు పడేసిన పాత బైక్‌ను విద్యుత్ వాహనంగా తీర్చిదిద్దాడు ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి వట్టెల వంశీ. గ్రామంలోని వట్టెల సుజాత-మల్లేశం దంపతుల కొడుకు వంశీ హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్నాడు. స్వగ్రామానికి వచ్చినప్పుడు తన తండ్రి పెట్రోల్ వాహనంతో పడుతున్న అవస్థలకు చెక్ పెట్టేయాలని ఆలోచించాడు. పాత బండిని ఈ-బైక్‌గా మార్చాలని నిర్ణయించుకున్నారు.

అందుకు అవసరమైన పరికరాలను వారం రోజుల్లో సమకూర్చుకున్నాడు. పాత ద్విచక్రవాహనానికి ఉన్న ఇంజన్, సైలెన్సర్‌ను తొలగించాడు. సుమారు రూ.16 వేలతో 750 వోల్ట్ కెపాసిటీ మోటారు, 48 వోల్ట్ బ్యాటరీ, చార్జర్, డిస్‌ప్లే, లైటును కొనుగోలు చేసి అమర్చాడు. రెండు గంటల పాటు ఛార్జింగ్ పెడితే కేవలం రూ.6 ఖర్చుతో 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా రూపొందించాడు. మూలకు పడేసిన పాత బండిని తన కొడుకు తయారుచేసిన ఈ-బైక్‌పై వ్యవసాయ పనులను వెళుతున్నానని మల్లేశం పేర్కొంటున్నాడు. పెట్రోల్ ఖర్చులు ఆదా అవుతున్నాయని చెబుతున్నాడు.

ప్రోత్సహిస్తే ఈ-బైక్‌లు తయారు చేస్తా

వంశీ, బీటెక్ విద్యార్థి



తనను ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఈ-బైక్‌లను తయారు చేస్తాను. ఆధునిక మోడల్‌లో ఆకర్షణీయమైన వాహనాలను మార్కెటులోకి తీసుకు వస్తా. తక్కువ ఖర్చుతో ఎక్కువ కిలోమీటర్ల దూరం ప్రయాణించే బైక్‌లను రూపొందిస్తాను.



పాత బైక్‌కు పరికరాలను బిగిస్తున్న విద్యార్థి వంశీ

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు 'ఆదర్శ' విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల - కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. 600 మీటర్ల రన్‌లో 9వ తరగతి చదువుతున్న సౌజ్ఞశ్రీ, 400 మీటర్లలో ఇంటర్ ఫస్ట్‌ఇయర్ శ్రీవాణి గెలుపొందారు 200 మీటర్ల రన్‌లో ఇంటర్ ఫస్ట్‌ఇయర్ చదువుతున్న అఖిల, శరణ్య, 100 మీటర్లలో ఇంటర్ ఫస్ట్‌ఇయర్ శ్రీజ, 8వ తరగతి చదువుతున్న రామకృష్ణ విజయం సాధించారు. లాంగ్ జంప్‌లో 10వ, తరగతి చదువుతున్న మనోజ్ఞ గెలుపొందింది. ఈనెల 3, 4 తేదీల్లో హన్మకొండలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని రాజ్‌కుమార్ తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఏపీఎంకు సన్మానం

ఎలిగేడు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండల అభ్యుదయ సమాఖ్య ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న పోగుల సుధాకర్‌ను శుక్రవారం సెర్ప్ సిబ్బంది సన్మానించారు. ప్రభుత్వ పరంగా మహిళల అభ్యున్నతికి ప్రవేశ పెడుతున్న పలు అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి మహిళా సంఘాల నుంచి గుర్తింపు పొందారు. ఆయన ఇక్కడ ఎనిమిదేళ్లపాటు పని చేసి జూలపల్లికి బదిలీపై వెళ్లారు. సీసీలు జ్యోతి, ఆనంద్, మల్లేశం, రజిత, వీవోఏలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

పాలకుర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్‌ఐ స్వామి అన్నారు. శుక్రవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఈసాలతక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుట్కా, గంజాయి, మాదకద్రవ్యాలు, సిగరేట్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

పలువురు ప్రజాప్రతినిధులకు సన్మానం

కమాన్‌పూర్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియామకమైన అన్వర్‌ను పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియామకమైన గట్టయ్య, అబ్దుల్ రఫీక్‌ను అభినందించారు. పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి, శంకర్ గౌడ్, ఆడేపు రమేష్, జంగపెల్లి లక్ష్మణ్, కాస రవి, దాసరి రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఈనెల 3న జూనియర్ బాలబాలికల స్టాఫ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి భాషబోయిన వాసు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని, క్రీడాకారులు 2013 జనవరి 1 నుంచి 2015 డిసెంబరు 31 మధ్యలో జన్మించి ఉండాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తున్న మంత్రి వివేక్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా మంత్రి వివేక్ పని చేస్తున్నారని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మాల సంఘం నాయకులు ఎరుకల లక్ష్మణ్‌రావు, బద్ద డానియల్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పెద్దపల్లి పార్లమెంట్‌లో అనేక స్కూళ్లు, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించారని, ఎంపీగా రాజకీయ జీవితం ప్రారంభించిన వివేక్ మంత్రిగా ఎదగడం హర్షనీయమని అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరినట్టు చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగే మంత్రి వివేక్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రమేష్, నంది నరేష్, శ్రీహరి, మర్రి ఐలయ్య, పిట్టల వెంకటి, కోల కనకయ్య, కొండ కుమార్, అందుగుల లింగయ్య, దాసరి రామస్వామి పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లిటిల్ మాడల్ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ మండలంలోని లిటిల్ మాడల్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తి కాకుండానే విద్యాబోధన చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

సుల్తానాబాద్ , ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు దీకొండ భూమేష్ కుమార్ ఐతరాజుపల్లి యూపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ప్లేట్లు పంపిణీ చేశారు. సుల్తానాబాద్ క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్ రావు, జిల్లా కో ఆర్డినేటర్ వలస నీలయ్య, క్లబ్ ప్రతినిధులు పిట్టల వెంకటేశం, ఆడెపు పాండురంగ, కన్న రమేష్,మాజీ సర్పంచ్ దేవేంద్ర వెంకన్న, రమణారెడ్డి, దాసరి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంగా పేరు మార్చాలి

ఓదెల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లలో కేంద్ర ప్రభుత్వ వాటా ఎంత ఉందో చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు ఇళ్లు ఇవ్వాలని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి తెలంగాణలో మంజూరు చేశారని, కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్లు అని పేరు పెట్టుకుందన్నారు. శుక్రవారం ఓదెల తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. మోదీ పేరు పెట్టకపోతే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. సారంగం, రాజేంద్ర ప్రసాద్, జీడుల రాజయ్య, పోలోజు శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు

రామగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్‌లకు శుక్రవారం ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేశారు. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిలో పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వ్యాన్‌లు, బస్సులు నడుపుతున్న డ్రైవర్‌లకు టెస్టులు చేశారు.

ఓపెన్‌డిగ్రీలో ప్రవేశాల గడువు పొడిగింపు

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు పొందటానికి ఈనెల 13 వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ కర్నాటి కృష్ణ, ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా శుక్రవారం తెలిపారు. 7382929649ను సంప్రదించాలన్నారు.

టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ కార్యవర్గం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూవీ లర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెడ్డి రాజ్‌కుమార్ ఎన్నికయ్యాడు. శుక్రవారం జరిగిన అసోసి యేషన్ ఎన్నిక జరిగింది. రవి, శ్రీనివాస్, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, శివ, సంజీవరెడ్డి, సమ్మిరెడ్డి, సత్యం పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరచేరని మండల ప్రత్యేకాధికారి ఆరీఫ్ అన్నారు. శుక్రవారం తారుపల్లి, మీర్జంపేట గ్రామాల్లో పర్యటించారు. స్వచ్ఛ శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి తడి చెత్త, పొడి చెత్త, నిలువ చేసే విధానం, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తెలిపారు. నర్సరీలు, వైకుంఠధామాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, రోడ్లు, సెగ్రిగేషన్ షెడ్, అంగన్‌వాడీ కేంద్రాలు, మంచినీటి చేతిపంపులను పరిశీలించారు. గ్రామపంచాయతీ సిబ్బంది, కార్యదర్శులకు సూచనలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, శ్రావణి, ఆశా కార్యకర్త రాధా, వీవోఏలు కవిత, రజిత, కార్యదర్శి ముత్యాల సందీప్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అధికారులు ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని పారబోసి, పరిశుభ్రత, పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించారు. సుల్తాన్‌పూర్‌లో ఎంపీడీఓ భాస్కర్ రావు, లోకపేటలో ఎంపీఓ కిరణ్‌లు సందర్శించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.


కనగర్తిలో ఇంటింటా పరిశీలిస్తున్న కార్యదర్శి సంధ్యారెడ్డి

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని డీఎల్‌పీవో ఆదేశించారు. అడవిసోమన్‌పల్లిలో హెల్త్ సబ్‌సెంటర్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీవో శేషయ్యసూరి, కార్యదర్శి ఉన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వానాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా కనగర్తిలో కార్యదర్శి సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీఏ లక్ష్మీ, అంగన్‌వాడి టీచర్ సుమలత సిబ్బంది పాల్గొన్నారు.

కనీస విద్యా ప్రమాణాలపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రామగుండం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన పలువురు ఉపాధ్యాయుల నుంచి విద్యార్థులకు మెరుగైన విద్య కోసం పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో రోజు పిల్లలకు ఏఐ ల్యాబ్‌లో కనీసం 20 నిమిషాల పాటు ఉండేలా షెడ్యూల్ రూపొందించాలన్నారు. విద్యార్థుల ప్రమాణాలు పెంచేలా ఏఐ టూల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రాబోయే ఐదేళ్లపాటు ఎలాంటి మార్పులు ఉండకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేలా కృత్యాలను రూపొందించుకోవాలని తెలిపారు. కనీసం 40 శాతం విద్యార్థులు బాగా చదివి, రాయడం వచ్చేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. విద్యార్థులకు వర్క్‌బుక్ ఉపయోగం చేయాలన్నారు. పిల్లల్లో స్కిల్స్ పెరిగితే గణితం, సైన్స్ సోషల్ బాగా అర్థం చేసుకునే వీలుంటుందని తెలిపారు. బేసిక్ విద్యాప్రమాణాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో పాఠశాలల అభివృద్ధి పనులు మూడు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. పాఠశాలకు సంబంధించిన సంపూర్ణ వివరాలు యూఐడీసీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా విద్యాధికారి మాధవి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఘనంగా ఆటో డ్రైవర్ల దినోత్సవం

ఎలిగేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శుక్రవారం ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు కవ్వంపల్లి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు మామిడాల రమేష్, తాటిపల్లి సతీష్ బాబు మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టపడుతూ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పరంగా డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కోడూరు శ్రీనివాస్, ఆటో డ్రైవర్లు ఎండి చాంద్ పాషా, ఉపాధ్యక్షులు కోట రమేష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఆటో డ్రైవర్లు

సాహిత్యంలో ప్రేమ్‌చంద్‌ది ప్రత్యేక పాత్ర


మాట్లాడుతున్న కవి సబ్బని లక్ష్మీనారాయణ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సాహిత్యంలో రచయిత ప్రేమ్‌చంద్‌ది ప్రత్యేక పాత్ర అని కవి సబ్బని లక్ష్మీనారాయణ కొనియాడారు. శుక్రవారం గోదావరిఖని స్నేహసాహితీ గ్రంథాలయంలో కవి మున్షీ ప్రేమ్‌చందర్ జయంతి నిర్వహించారు. ప్రధానవక్తగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాస్తవిక అంశాలను సరళమైన భాషలో రాసి ప్రజలను చైతన్యం చేసిన గొప్ప రచయిత ప్రేమ్‌చంద్ అని పేర్కొన్నారు. వితంతువును వివాహమాడి ఆదర్శప్రాయుడు అయ్యారని, భారత స్వాతంత్ర్యం కోసం పనిచేశారని, అత్యంత సాధారణంగా జీవిస్తూ ఆనాడు ఆంగ్లేయులు ఇచ్చే బిరుదులను తిరస్కరించిన ప్రేమ్‌చంద్ తన ఉద్యోగానికి రాజీనామా చేసిన త్యాగధనుడు అని కొనియాడారు. అఖిల భారతీయ ప్రగతి శీల రచయితల సంఘం అరసం వ్యవస్థాపనలో కీలక భూమిక పోషించాడని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని సూచించారు. కవి, రచయిత స్నేహసాహితీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఏలేశ్వరం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు రాకుమార, దాస్యం లక్ష్మయ్య, స్నేహలత, న ర్సయ్య, పోచయ్య, పుట్ట రాజయ్య, ప్రకాష్‌రెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

పదవీకాలం పొడిగింపా.. ప్రత్యేక పాలనా...

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల ప్రక్రియ చేపట్టిన దాఖలాలు కనబడడం లేదు. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల చైర్మన్లలో అత్యధిక మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వాళ్లే కావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎన్నికలకు ముందు నలుగురైదుగురు చైర్మన్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సహకార సంఘాల గడువు ముగిసిన ప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడి ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకులు పెంచుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్లతో ముడిపడి ఉండడంతో అవి ఆలస్యం అవుతున్నాయి. ఎలాంటి చిక్కులు లేని సహకార సంఘాల ఎన్నికలను ఎందుకు నిర్వహించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. గడువులోపు ఎన్నికలు నిర్వహించకుంటే ఉన్న పాలక వర్గాల పదవీ కాలం పెంచకుండా, ప్రత్యేక అధికారుల పాలన తీసుక వచ్చి ఎన్నికల ప్రక్రియను ఆరంభించి నెల రోజుల్లో ఎన్నికలను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

బీజేపీలో చేరనున్న నల్ల మనోహర్‌రెడ్డి


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానిస్తున్న మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీపై కొంత కాలంగా నారాజుగా ఉన్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ఆ పార్టీని వీడి భారతీయ జనతా పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డితో కలిసి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావును గురువారం రాత్రి హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు ఈ సందర్భంగా ఆయన బీజేపీలో చేరేందుకు రాష్ట్ర అధ్యక్షుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నెల 5న పెద్దపల్లి పట్టణంలో జరగనున్న బీజేపీ కార్యకర్తల సమ్మేళనం కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు హాజరు కానున్నారు. ఆయన సమక్షంలో నల్ల మనోహర్ రెడ్డి తన అనుచరులతో బీజేపీలో చేరనున్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

జ్యోతినగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు పిల్లలను తీసుకు వచ్చే ఆటో, బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఎన్టీపీసీ సెయింట్ క్లేర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ ఎ.డోమినిక్ అన్నారు. రామగుండం ట్రాఫిక్ పోలీసు అధికారుల సూచనల మేరకు శుక్రవారం సెయింట్ క్లేర్ పాఠశాల ఆడిటోరియంలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాటాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడప వద్దని సూచించారు. స్కూల్ బస్సులో విద్యార్థులు చేతులు బయట పెట్టకుండా చూడాలని, వాహనాలను ఫిట్‌గా ఉంచుకోవాలన్నారు. ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. డ్రైవర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖనిలో ఘనంగా ప్రపంచ స్కార్ఫ్ డే

కోల్‌సిటీ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో శుక్రవారం ప్రపంచ స్కార్ఫ్ డే నిర్వహించారు. భారత్ స్కౌట్స్‌అండ్ గైడ్స్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆర్జీ-1 ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లో నిర్వహించారు. ఆర్జీ-1 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి హాజరై స్కౌట్స్‌అండ్ గైడ్‌లకు స్కార్ఫులు అందజేశారు. సెయింట్ పాల్స్ హైస్కూల్ డైరెక్టర్ ఫాదర్ షిబిన్ మ్యాథ్యూస్‌జాన్, హెడ్ మిస్ట్రెస్ వాణి, గైడ్ కెప్టెన్ కె.లక్ష్మీకుమారి, స్కౌట్ మాస్టర్ డి.కుమార్, డీఓసీ వి.వెంకటస్వామి, ఏఎస్ఓసీ పి.సాయినిరంజన్, రోవర్ లీడర్లు కె.బుచ్చయ్య, దేవేందర్, గట్టు మల్లు, రామ్‌చందర్, రాజయ్య, జి.కుమార్, సతీష్, జ్యోతి, నీలిమ పాల్గొన్నారు.


ప్రపంచ స్కార్ఫ్ డేలో స్కౌట్స్ అండ్ గైడ్స్

అమెరికా నిర్బంధాన్ని వ్యతిరేకించాలి

గోదావరిఖని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అమెరికా దేశం క్యూబాపై నిర్బంధం విధించిందని, దానికి వ్యతిరేకంగా క్యూబా పోరాడుతోందని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి అన్నారు. గురువారం ప్లంబర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. క్యూబా ప్రజలకు అండగా నిలబడాలని ఈనెల 10వరకు సంఘీభావ నిధి వసూలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సరిగొమ్ముల మధు, పంగా అంజయ్య, కోశాధికారిగా అన్నం కుమార్, ఉపాధ్యక్షులుగా తోట రాజబాబు, బద్రి శంకర్, సహాయ కార్యదర్శులుగా మేరుగు రమేష్, మద్దెల కొమురయ్య, ప్రచార కార్యదర్శిగా డీ ప్రకాష్, కమిటీ సభ్యులుగా 40మందిని ఎన్నుకున్నారు.

విద్యార్థులకు షీటీంపై అవగాహన

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో షీటీం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలన్నారు. షీటీం ఇన్‌చార్జీ ఎస్‌ఐ లావణ్య ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, షీటీమ్ సభ్యులు మౌనిక, సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

పాలకుర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగంలో బాధ్యతయుతంగా పనిచేసినప్పుడు జీవితంలో ఎంతో సంతృప్తిని కలగజేస్తుందని మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పదవీ విరమణ పొందిన లైన్ ఇన్‌స్పెక్టర్ ఊట్ల శ్రీనివాస చారి దంపతులను సన్మానించారు. 327 యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీబి రాజు, ఎస్.సి గంగాధర్, మంథని డిఈఈ వి ప్రభాకర్, పెద్దపల్లి డీఈ బాలయ్య, డివిజనల్ ప్రెసిడెంట్ వీరాచారి, సెక్రెటరి రాజేందర్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

కోల్‌సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు దోమల నిర్మూలనకు సహకరించాలని కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి కోరారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు సంజయ్‌గాంధీనగర్ ప్రాంతంలో ఇండ్ల మధ్యలో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరిగే అవకాశం ఉందని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయించారు. నాగభూషణం, శానిటరీ జవాన్లు, పాల్గొన్నారు.

ఏపీఎంకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): క్రాంతి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం బదిలీపై సుల్తానాబాద్‌కు వెళుతున్న ఏపీ ఎం కనుకయ్యను మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఐకేపీ సిబ్బంది సన్మానించారు. సెర్ప్ సిబ్బంది, సీసీలు శారద, నిర్మల, హరికృష్ణ, తిరుమల, కనకతార, అధికారులు మౌనిక, రవలి, వరలక్ష్మి, సిబ్బంది చంద్రకళ, తాజోద్దీన్, పాల్గొన్నారు.

భూకబ్జాపై ఫిర్యాదు

మంథని, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భట్టుపల్లిలో ఎకరం భూమిని గ్రామానికి చెందిన వ్యక్తులు కబ్జా చేయటానికి ప్రయత్నిస్తున్నారని కూచిరాజ్‌పల్లి గ్రామానికి చెందిన నక్క వివేక్, శేఖర్‌లు, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.



ఆర్జీ-3లో పర్యటించిన కేంద్ర పర్యావరణ శాస్త్రవేత్త

రామగిరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో కేంద్ర పర్యావరణ అడ్వైజర్ శాస్త్రవేత్త తరుణ్ కుమార్ శుక్రవారం పర్యటించారు. జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ విభాగం జీఎం బానోత్ సైదులుతో సమావేశం నిర్వహించారు. గనులు, ఏరియాల్లో పర్యావరణంపై తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం జీడీకే 10 ఇంక్లైయిన్, అడ్రియాల లాంగ్‌వాల్, ఓసిపి-2 ప్రాజెక్టులను సందర్శించారు. గనుల విస్తరణలో పర్యావరణాన్ని కాపాడేందుకు చేస్తున్న పనులను పర్యవేక్షించారు. అడ్రియాల ప్రాజెక్టు ఆవరణలో మొక్కలు నాటారు. అధికారులు రామ్మోహన్, వెంకటరమణ, రాజాశేఖర్, జనార్ధన్, రాజారెడ్డి, ఐలయ్య, రామారావు, సునీల్‌కుమార్, సుధాకర్, కిషన్, రవికిరణ్, పాల్గొన్నారు.


గనిలోకి వెళుతున్న కేంద్ర పర్యావరణ అడ్వైజర్ శాస్త్రవేత్త తరుణ్

రేపు ఉచిత వైద్య శిబిరం

రామగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 3నఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ సుదర్శనం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియా, న్యూరో, యురోలాజిస్ట్ వైద్యులు రానున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగులు సద్వినియోగం చేసుకొవాలని సూచించారు.

గ్రాడ్యుటీ క్లెయిమ్స్‌ను పూర్తి చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుటీ పెండింగ్‌లో ఉన్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు క్లయిమ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్జీ-2 డీజీఎం పర్సనల్, అధికార ప్రతినిధి అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్జీ-2 ఏరియాలో 130 మంది మాజీ ఉద్యోగులు క్వార్టర్ ఖాళీ చేయని కారణంగా, 26 మంది ఎటువంటి సమాచారం లేకుండా గ్రాడ్యుటీ డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

ఆర్‌జీ-1లో 104శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1లో జూలైలో 104శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని జీఎం లలిత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూలైలో ఆర్‌జీ-1లో 3.2లక్షల టన్నులకు గాను 3.33లక్షల టన్నులు ఉత్పత్తి సాధించి 104 శాతం లక్ష్యాన్ని సాధించిందని, సింగరేణి వ్యాప్తంగా 20.81లక్షల టన్నులకుగాను 20.18లక్షల టన్నులను సాధించి 97శాతం లక్ష్యాన్ని సాధించిందని చెప్పారు. జీడీకే1, 3ఇంక్లైన్ 17వేల టన్నులకు 13వేల టన్నులు, జీడీకే2, 2ఏ ఇంక్లైన్ 21వేల టన్నులకు గాను 12వేల టన్నులు, జీడీకే 11ఇంక్లైన్ 72వేల టన్నులకు గాను 47 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, జీడీకే ఓసీపీ-5 2లక్షల టన్నులకు గాను 2.6లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందని, ఏరియా వ్యాప్తంగా అదనంగా 13వేల టన్నుల ఉత్పత్తి సాధించిందన్నారు. జూలైలో అధిక వర్షాలు కురిసినప్పటికీ ఓసీపీ-5లో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని సాధించిందని చెప్పారు. మేడిపల్లి ఓసీపీలో పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెందిన వాప్కో కంపెనీ డీపీఆర్ చేయడానికి ఇటీవల పరిశీలించిందన్నారు. సీఎండీ బలరాంనాయక్ ఆదేశాల మేరకు గ్రీన్ హైడ్రోజన్ తయారీని కూడా చేపడుతామని, రామగుండంలో 5మెగావాట్ల సోలార్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఐఈడీ ఏజీఎం అంజనేయులు, డీజీఎం(వర్క్‌షాప్) జితేందర్‌సింగ్, అధికారులు ధనలక్ష్మి బాయి, వీరారెడ్డి, శ్రావణ్ కుమార్, వేణు, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

ఆర్జీ-3లో 73 శాతం, ఏపిఏలో 10 శాతం

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌లో జూలైలో నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలను జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు శుక్రవారం వెల్లడించారు. ఆర్జీ-3 డివిజన్‌లో 4.40 లక్షల టన్నులకు గాను 3.22 లక్షల టన్నులు సాధించి 73 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఏపిఏ డివిజన్‌లో నిర్ధేశించిన 1.35 లక్షల టన్నులకుగాను 0.13 లక్షల టన్నులు సాధించి 10 శాతంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు తీరు అన్యాయం

సింగరేణి మెడికల్ బోర్డు కార్మికులకు తీరని అన్యాయం చేసిందని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ ప్రకటనలో పేర్కొన్నారు. హైయర్ రిఫరల్ పేరుతో 9 నెలలపాటు 52 మంది కార్మికులను పెండింగ్‌లో పెట్టి చివరకు కేవలం ఐదుగురిని మాత్రమే అన్వాలిడేషన్ చేయడం దారుణమని తెలిపారు. 47 మందిని ఫిట్ ఫర్ సేమ్ డ్యూటీ అని నిర్ధారణ చేయడం అనైతికమని, ఫిట్ అని నిర్ధారిస్తే 9 నెలల వేతనాలు నష్టపోయే వారు కాదని తెలిపారు. బేరం కుదరకపోవడంతో అందరిని ఫిట్ చేసినట్టు తాము అనుమానిస్తు న్నామని, జూలై 30, 31న నిర్వహించిన మెడికల్ బోర్డును తిరిగి నిర్వహిం చాలని డిమాండ్ చేశారు.

మహిళా సిబ్బందికి రెస్క్యూ శిక్షణ ముగింపు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి మహిళా ఉద్యోగినుల రెస్క్యూ రెండో బ్యాచ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. అండర్ మేనేజర్ ఉద్యోగులు ఇనిషియల్ శిక్షణ పొందారు. రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి సర్టిఫికేట్లు అందజేశారు. రెస్క్యూతో విధి నిర్వహణలో ఎదురయ్యే విప త్కర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందన్నారు. రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మూర్తి, ట్రైనర్స్ కిషన్‌రావు, శ్రవణ్ పాల్గొన్నారు.


శిక్షణ ముగించుకున్న బృందంతో అధికారులు